

హత్య కేసుపై పోలీసుల విచారణ
నవీన్ హత్య కేసులో తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.
- 8లో



చిరుధాన్యాల సాగుపై ఆసక్తి
తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇస్తున్న చిరుధాన్యాల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
40°/25°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.





తండ్రికి తోడూ నీడగా..

నాగారం మండల కేంద్రంలోని తమ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించడానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంగళవారం తన తండ్రి గుంటకండ్ల రామ చంద్రారెడ్డితో కలిసి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఎండ తగలకుండా మంత్రి తానే స్వయంగా తండ్రికి గొడుగుపట్టి వ్యవసాయ క్షేత్రంలో కలియదిరిగారు. మంత్రి అయినా తన తండ్రికి గొడుగు పట్టి తోడూ నీడగా ఉండి హోదా కంటే బాధ్యత గొప్పదని చాటిచెప్పారు.

-నాగారం

ముగిసిన పదో తరగతి పరీక్షలు



చివరి రోజు పరీక్ష ముగియడంతో స్నేహితులకు గుర్తుగా ఆటోగ్రాఫ్ ఇస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష కొనసాగింది. మొత్తం 12,221 మంది విద్యార్థులకు గాను 12,185 మంది హాజరు కాగా 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఆరుగురు ప్రైవేట్ విద్యార్థులకు గాను ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ పలు సెంటర్లను తనిఖీ చేశారు. అలాగే స్క్వాడ్ కూడా కొన్ని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసింది. బుధవారం జిల్లాలో 11 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులకు చివరి పరీక్ష ఉంటుందని డీఈఓ తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

న్యూస్‌రీల్

మహిళా ఆరోగ్యంతోనే సమాజ శ్రేయస్సు



పెన్‌పహాడ్‌లో ఆరోగ్య మహిళా పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక

పెన్‌పహాడ్: ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం శ్రేయస్కరంగా ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావు అన్నారు. పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న ఆరోగ్య మహిళా పథకాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. సమాజంలో మాతృమూర్తే ప్రధానమని, అమ్మ ఆయురారోగ్యాలతో ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఆరోగ్య మహిళా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 57రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్య మహిళా పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, వైద్యాధికారి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మామిడి అంజయ్య, ఇంద్రసేనారావు, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసవత్తరంగా రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేకార్చనలు చేశారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్ , ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు , పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి , ఆంజనేయాచార్యులు ,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలి

సూర్యాపేటటౌన్: విద్యార్థులు లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలని, విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు దోమల రమేష్, స్పోర్ట్స్ సెక్రటరీ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో గణితం, రసాయనశాస్త్రం, అర్థశాస్త్రం సబ్జెక్టులపై విస్తృత ఉపన్యాసాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి గణితశాస్త్రంపై పట్టు సాధించాలన్నారు. గణిత శాస్త్రంతో సరైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర హెచ్‌ఓడీ డాక్టర్ అంపిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కెప్టెన్ వి.వెంకటేషులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగా తరగతులు ప్రారంభం

నల్లగొండ టౌన్ : యోగా మహోత్సవాల సందర్భంగా మంగళవారం హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతిగృహంలో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులను కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకిదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా అందరికీ చాలా అవసరమన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదాసు వెంకటాచారి, యోగా ట్రైనర్ నాగేశ్వర్‌రావు, ఎస్.జోగారెడ్డి పాల్గొన్నారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేలా..

- అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మౌలిక వసతులపై దృష్టి
- రెండు రోజులుగా మాక్ డ్రిల్ నిర్వహణ
- అందుబాటులో 550 బెడ్లు



తిరుమలగిరిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఇతర రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్నందున కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించేలా చూడాలని, అర్హులైన వారందరూ ప్రికాషన్ డోస్ తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ నేపథ్యంలో కోవిడ్ ముప్పును ఎదుర్కోవడానికి వైద్య ఆరోగ్య శాఖ రెడీ అయ్యింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సన్నద్ధతపై సోమ, మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఆక్సిజన్, పడకలు తదితర వసతుల కల్పనపై చర్యలు చేపట్టింది.

ఇబ్బందులు అధిగమించేలా..
కోవిడ్ మూడో దశ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 550 పడకలు ఏర్పాటు చేశారు. అన్నింటిలో ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. మొదటిసారి కన్న రెండో దశలో కేసుల తీవ్రత, పడకల కొరతతో కొద్ది మందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆక్సిజన్ సరిగా అందక పోవడంతో అవస్థలు పడ్డారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు ఈ సారి అన్ని ఆస్పత్రుల్లో ముందస్తుగానే చర్యలు చేపడుతున్నారు.

సౌకర్యాల కల్పనపై..
వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో కోవిడ్ పరీక్షల నిమిత్తం కిట్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఈ మేరకు పరీక్షల మాక్ డ్రిల్ చేసి నివేదికను రాష్ట్ర శాఖకు పంచారు. పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు అవసరమని విన్నవించారు. జిల్లాలో ఐసోలేషన్ బెడ్లు 130, ఆక్సిజన్ సపోర్టెడ్ బెడ్లు 200, ఐసీయూ బెడ్లు 220, వెంటిలేటర్స్ 32, అంబులెన్సులు (బీఎల్ఎస్ 20, ఏఎల్ఎస్ 5)25 అందుబాటులో ఉంచారు. మౌలిక వసతుల కల్పనలో జిల్లా వైద్య శాఖ యంత్రాంగం నిమగ్నమైంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



కోవిడ్ ముప్పు ముంచుకొచ్చినా సమస్యను అధిగమించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. మాక్ డ్రిల్‌లో భాగంగా ఆస్పత్రుల్లో వసతులపై నివేదికలు సిద్ధంచేసి వైద్య ఆరోగ్యశాఖకు పంపాం. కోవిడ్‌ను ఎదుర్కోవడానికి వైద్య శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ నాజియా తబస్సుమ్, డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ ఆఫీసర్, సూర్యాపేట

పూలే స్ఫూర్తితో కేసీఆర్ పాలన

- మంత్రి జగదీశ్ రెడ్డి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : భారత దేశానికి వెలుగు ప్రసాదించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన స్ఫూర్తితో సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సూర్యాపేటలోని పూలే విగ్రహానికి మంత్రి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక దార్శనికుడిగా, సంఘ సంస్కర్తగా, వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి బాటలు వేసిన క్రాంతికారుడు పూలే అని అన్నారు. వివక్షలేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త పూలే అని కొనియాడారు. 2014 కు ముందు పాలించిన పాలకులు పూలే ఆశయ సాధన కు వ్యతిరేకంగా పాలన కొనసాగిస్తే జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. సబ్బండ వర్ణాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , అదనపు కలెక్టర్ మోహన్ రావ్, జిల్లా పరిషత్ చైర్మన్ గుజ్జా దీపిక, వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్‌మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్య నారాయణ, కార్మిక నాయకుడు వై.వీ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సత్యనారాయణ పిల్లే, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నర్సింహ, భూపతి నారాయణగౌడ్, శారద దేవి, నాయకులు చినశ్రీరాములు, తల్లమళ్ళ హసెన్, తప్పెట్ల శ్రీరాములు, కక్కిరేని శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు తాహెర్ పాషా, రాజేష్, అభినయ్, జ్యోతి శ్రీ విద్య, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డాక్టర్ రామూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు.. నలుగురు సీఐలు

- ఒకరు సంవత్సరానికి.. మరొకరు ఆరునెలలకే బదిలీ
- చర్చనీయాంశమైన కోదాడ పట్టణ సీఐ పోస్టు



కోదాడ: నియోజకవర్గ కేంద్రంలో ఎంతో కీలకమైన కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ల బదిలీ చర్చనీయాంశమవుతోంది. ఇక్కడికి వచ్చినవారు ఏడాది తిరగక ముందే ట్రాన్స్‌ఫర్ అవుతున్నారు. ఇలా నాలుగేళ్ల కాలంలో నలుగురు సీఐలు మారారు. తాజాగా నాలుగో సీఐ ఆంజనేయులు సోమవారం ఈ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. డిపార్టుమెంట్ పరంగా కంటే కూడా రాజకీయ కారణాలతోనే ఈ బదిలీలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. సోమవారం వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన శివశంకర్ కూడా ఓ కేసులో అధికార పార్టీకి చెందిన ఓ మండలపార్టీ అధ్యక్షుడిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయడంతో పాటు నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ మండల స్థాయినేత చెప్పినట్లు వినకపోవడంతో పట్టుబట్టి బదిలీ చేయించినట్లు చర్చ జరుగుతోంది. అధికారులు మాత్రం ఇది సాధారణ బదిలీయేనని అంటున్నారు.

బదిలీపై పట్టుబట్టి..
2019లో ఎన్నికలు జరిగే సమయంలో కోదాడ పట్టణ సీఐగా శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఆయన బదిలీ అయిన తరువాత ఆయన స్థానంలో గతంలో మేళ్లచెరువు ఎస్ఐగా పనిచేసి సీఐగా ప్రమోషన్ పొందిన నరసింహారావును నియమించారు. ఆయన దాదాపు 13 నెలలు ఇక్కడ పని చేశారు. ఆయనను ఆకస్మికంగా మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేసి ఆయన స్థానంలో శివశంకర్‌ను నియమించారు. గత సంవత్సరం ఆగస్టులో కోదాడకు సీఐగా వచ్చారు. దూకుడు స్వభావం ఉన్న శివశంకర్‌కు అధికార పార్టీలో కిందిస్థాయి నేతలకు మధ్య తరచు విభేదాలు వస్తుండడంతో పాటు ఓ కేసు విషయంలో కోదాడ మండల పార్టీ అధ్యక్షుడిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడంతో వారంతా ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధి చెప్పిన పనులకు ఓకే చెప్పడం లేదని, వివిధ పనులపై తాను పంపిన వారికి కనీస మర్యాద ఇవ్వడం లేదని సదరు నేత ఆయన బదిలీపై పట్టుబట్టి విజయం సాధించినట్లు పలువురు పోలీస్ సిబ్బందే అంటున్నారు.

మునగాల టు కోదాడ..
కోదాడ సబ్‌డివిజన్ పరిధిలోని మునగాల సీఐగా పనిచేస్తున్న ఆంజనేయులును కోదాడ పట్టణ సీఐగా బదిలీ చేశారు. 2021 జనవరి నుంచి ఆయన మునగాల సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం చివర్లో ఎన్నికలు జరగనున్నాయి. అవి పూర్తి అయ్యే వరకు ప్రస్తుత సీఐ ఉంటారా లేదా ఎన్నికల ముందు మరోసారి జరిగే బదిలీలలో వెళతారా అనేది వేచి చూడాలి.

సీఐల బదిలీ

సూర్యాపేట క్రైం: జిల్లాలో కొందరు సీఐలను మంగళవారం బదిలీ చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శివశంకర్‌ను జిల్లా స్పెషల్‌బ్రాంచ్‌కు, మునగాల సీఐ ఆంజనేయులును కోదాడ టౌన్‌కు బదిలీ చేశారు. మునగాల సీఐగా వీరరాఘవులును నియమించారు.

అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని 16, 17, 20, 34, 35, 36, 47 వార్డుల పరిధిలో నాలా నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ అంతర్గత కనెక్షన్‌ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామానుజులరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ గిలకత్తుల సత్యనారాయణ, కౌన్సిలర్లు జ్యోతిశ్రీవిద్య, సుంకరి అరుణరమేష్, మడిపల్లి విక్రమ్, భరత్ మహాజన్, తాహేర్‌పాషా, ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ సత్యారావు, రమాదేవి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, బండ జనార్దన్‌రెడ్డి, ఏఈఈ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ప్రజా పోరు యాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ అధ్వర్యంలో ఈ నెల 14 నుంచి ప్రజా పోరుయాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రజాపోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ యాత్రను చివ్వెంల మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ యాత్రలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పార్టీ డివిజన్ నాయకులు కందుకూరి కొండయ్య, జీవన్, పీవైఎల్ జిల్లా నాయకుడు గోగుల వీరబాబు, ఇఫ్టూ జిల్లా నాయకుడు వాజిద్, పీఓడబ్ల్యూ నాయకులు పద్మ, శైలజ, వెంకటమ్మ, నర్సయ్య,హుస్సేన్, అనిల్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈనెల 16 నుంచి18 వరకు తిరుపతిలో నిర్వహించనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ ఏడవ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని న్యూడెమొక్రసీ కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా నాయకులు సామా నర్సిరెడ్డి, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి మురళి, భరత్, పెద్దింటి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక పోలీసింగ్‌లో రెండు పోలీస్‌స్టేషన్ల ప్రతిభ

- తిరుమలగిరికి 7వ, నేరేడుచర్లకు 15వ స్థానం
- ర్యాంకులను ప్రకటించిన డీజీపీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: ఆధునిక పోలీసింగ్ నిర్వహణలో జిల్లాలో రెండు పోలీస్ స్టేషన్లు ప్రతిభ కనబర్చాయి. తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు 7వ, నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌కు 15వ స్థానం దక్కింది. మంగళవారం హైదరాబాద్ నుంచి పోలీస్ అధికారులతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందులో ర్యాంకులను కూడా ప్రకటించారు. జిల్లా పోలీస్‌కార్యాలయంలో ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రజలతో మమేకమైన పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. సీసీటీఎన్ఎస్ నిర్వహణ, పోలీస్ ఫంక్షనల్ వర్టికల్, పోలీస్‌స్టేషన్ల 5ఎస్ నిర్వహణ, 60రోజుల్లో నేర అభియోగం పత్రాల దాఖలు చేయడం, కేసుల్లో శిక్షల అమలు, కేసుల స్థితిగతులు, ఆన్‌లైన్ నమోదు, కోర్టు కేసుల నిర్వహణ, కమ్యూనిటీ కార్యక్రమాలు, సంఘటనలపై రియల్ టైమ్ స్పందన, సాంకేతికత వినియోగం, కేసుల పరిష్కారం, కేసుల ఛేదన, క్రైమ్ తగ్గించడం, డయల్100 ఫిర్యాదులపై స్పందన, రోడ్డు భద్రత తదితర అంశాలను కొలమానంగా తీసుకొని ఈ ర్యాంకులను డీజీపీ ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో మరింత మెరుగైన పోలీస్ సేవలను అందిస్తామని ఎస్పీ చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీరవి, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, నాగారం సీఐ రాజేష్, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, తిరుమలగిరి ఎస్ఐ శివకుమార్, నేరేడుచర్ల ఎస్ఐ నవీన్, డీసీఆర్బీ, ఐటీ కోర్ ఎస్ఐలు రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకం రద్దయినా పైసలివ్వరా..

- అభయహస్తం లబ్ధిదారులకు అందని ప్రీమియం డబ్బులు
- గతేడాదే జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- నేటికీ నెరవేరని మంత్రుల హామీ
- రావాల్సిన బకాయిలు రూ.14.65 కోట్లు
- ఎదురుచూపుల్లో 80,300 మంది సభ్యులు



2022 ఏప్రిల్‌లో చెల్లిస్తామని చెప్పినా..

అభయహస్తం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కింద స్వయం సహాయక సంఘాల మహిళలు గతంలో పొదుపు చేసిన మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 2022 ఏప్రిల్ మాసంలో అసెంబ్లీ సమావేశ మందిరంలో మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి సమీక్ష నిర్వహించిన ప్రీమియం నిధులు తిరిగి చెల్లిస్తామని వెల్లడించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కానీ, మంత్రులు హామీ ఇచ్చి సంవత్సరం దాటినా నేటికీ లబ్ధిదారులకు మాత్రం తాము చెల్లించిన డబ్బులు అందలేదు.

దురాజ్‌పల్లి(సూర్యాపేట): అభయహస్తం పథకం నిధులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పథకం రద్దుతో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వృద్ధాప్య పెన్షన్లతో సంబంధం లేకుండా అభయహస్తం కింద పెన్షన్లు అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి సభ్యురాలు రోజుకు రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 ప్రీమియంగా చెల్లించే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. పొదుపు చేసిన వారు సహజంగా మరణిస్తే రూ.30 వేల ఆర్థిక సాయం, ప్రమాదవశాత్తు అయితే రూ.75 వేలు ఆ కుటుంబానికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక.. 60 ఏళ్ల వయస్సు దాటిన మహిళలకు నెలకు రూ.500 పెన్షన్ ఇచ్చారు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏడాదికోసారి పెన్షన్లు ఇవ్వడం మొదలు పెట్టి 2017 నుంచి పూర్తిగా నిలిపివేసింది.

ఎనిమిదేళ్ల పాటు ప్రీమియం చెల్లింపు..
అధికారికంగా జిల్లాలో 80,300 మంది లబ్ధిదారులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంతకాలం లెక్కలను పరిశీలిస్తే ఏటా అందరూ రూ.365 చొప్పున ఎనిమిదేళ్ల పాటు ప్రీమియం చెల్లించారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుంటే 80,300 మంది రూ.365 చొప్పున ఏడాదికి రూ. 2,93,09,500 చెల్లించారు. 2009 నుంచి 2017 వరకు ఈ పథకం కొనసాగగా.. పథకం ప్రారంభం నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం వరకు అంటే ఐదేళ్లకు సంబంధించి లబ్ధిదారులు ఏటా రూ.365 చొప్పున చెల్లించిన మొత్తం 14,65,47,500 రూపాయలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఆ తర్వాత నుంచి ప్రభుత్వం ప్రీమియం కట్టించుకోలేదు.

పథకం రద్దుతో..
చెల్లించిన ప్రీమియం నిధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండానే అభయహస్తం పథకాన్ని రద్దు చేయడంపై అనుమానాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నిధులను తమకు తిరిగి చెల్లిస్తారా.. లేదా అని సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జీఓ ఎంఎస్ నంబర్ 36 ప్రకారం రెండేళ్లు వరుసగా ప్రీమియం కట్టించుకోనట్లైతే సభ్యురాలి ఖాతా రద్దు అవుతుంది. అయితే 5 ఏళ్ల నుంచి ప్రభుత్వం ప్రీమియం కట్టించుకోవడం లేదు. ఇదే టైంలో వీరి నుంచి ఇంతకాలం సేకరించిన ప్రీమియం నిధుల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒక్క సూర్యాపేట జిల్లాను యూనిట్‌గా తీసుకుంటే ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఉంటే రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన నిధుల సంగతి ఏంటి? నిధులు మొత్తం ఏమయ్యాయనే దానిపై ప్రభుత్వమే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

చెరువులో పడి ఇద్దరు కూలీలు మృతి

- చండూరు మండలం దోనిపాముల గ్రామంలో ఘటన


లక్ష్మమ్మ (ఫైల్)


లింగమ్మ (ఫైల్)

చండూరు: ఉపాధి హామీ పనులు చేసేందుకు వెళ్లిన ఇద్దరు కూలీలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన చండూరు మండలంలోని దోనిపాముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. దోనిపాముల గ్రామంలోని చెరువు శిఖంలో ఉపాధి హామీ పథకం కింద చేపల పెంపకానికి నీటి గుంటలు (ఫిష్ పాండ్స్) తవ్వే పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు మిగతా కూలీలతో పాటు మంగళవారం ఉదయం చిలకరాజు లింగమ్మ(63), సూరు లక్ష్మమ్మ(62) వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పనులు ముగించుకొని మిగతా కూలీల కంటే ముందుగా ఆ ఇద్దరు ఇంటి బాట పట్టారు. ఇంటికి వెళ్తూ దారిలో కాళ్లు, చేతులు కడుక్కునేందుకు చెరువు వద్దకు వెళ్లారు. కాళ్లు కుడుక్కుంటున్న సమయంలో ఒకరు కాలు జారి నీటిలో పడిపోవడంతో రక్షించే క్రమంలో మరొకరు వెళ్లగా ఇద్దరూ నీటిలో పడిపోయారు. అయితే, మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా లింగమ్మ, లక్ష్మమ్మ ఇంటికి చేరుకోక పోవడంతో కుటుంబ సభ్యులు చెరువు దగ్గరకు వెళ్లి చూడగా నీటిలో తేలుతూ కనిపించారు. గ్రామస్తులు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నవీన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లక్ష్మమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

గ్రామంలో విషాదఛాయలు..

చిలుకూరి లింగమ్మ, సూరు లక్ష్మమ్మ మృతితో దోనిపాముల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లింగమ్మ, లక్ష్మమ్మ మంచి స్నేహితులని, కులాలు వేరైనా ఆ వృద్ధులిద్దరూ అత్తాకోడళ్లుగా ఒకరికొకరు పిలుచుకుంటూ సాధకబాధకాలు తెలుసుకునేవారని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. వారిద్దరి భర్తలు చాలా ఏళ్ల క్రితమే మృతిచెందారని, లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, చిలుకూరి లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ రెండు కుటుంబాలకు చెందిన వారికి భూమి లేదని, కూలీ పైనే ఆధారపడి జీవిస్తున్నారని, ఉపాధి పనులు లేని సమయంలో వ్యవసాయ పనులకు వెళ్తూ కుటుంబ సభ్యులకు ఆసరా ఉండేవారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నిర్మాణ పనుల పరిశీలన


కాంతి ల్యాబొరేటరీస్ ముందు అధికారులు

చండూరు(గట్టుప్పల): గట్టుప్పల శివారులో ఏర్పాటుచేస్తున్న కాంతి ల్యాబొరేటరీస్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. దీంతో ఆర్డీఓ ఆదేశాల మేరకు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ మంగళవారం కంపెనీ యాజమాన్యం ఇచ్చిన ధృవీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రాలను పరిశీలించారు. కంపెనీ వద్ద సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్ పరిశీలన జరిపారు. నివేదికను ఆర్డీఓకు అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం, బీఎస్పీ నాయకుడు వడ్డేపల్లి సైదులు, పెదగాని రాఘవేంద్ర, వెల్మకన్నె నాయకులు పర్వతాలు, శ్రీరాములు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కారం గ్రామ శివారులో తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ముస్కు నవీన్‌రెడ్డి ఇంట్లో అందుగుల వెంకటేష్, ఆత్మకూరి శివరామరాజు వేర్వేరుగా అద్దెకు ఉంటున్నారు. వేసవి కావడంతో రోజువారి మాదిరిగానే సోమవారం రాత్రి సైతం వారు ఇళ్లకు తాళాలు వేసి నిద్రించేందుకు భవనం పైకి వెళ్లారు. మంగళవారం తెల్లవారాక శివరామరాజు నిద్రలేచి కిందకు వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా తులం బంగారం, 10తులాల వెండి, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించాడు. అదేవిధంగా గుర్తుతెలియని వ్యక్తులు వెంకటేష్ ఇంట్లో కూడా చొరబడి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, 10తులాల వెండి, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


పెండెం శ్రీనివాస్

హుజూర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి రెండేళ్లైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం హుజూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని పీర్లకొట్టం బజార్‌కు చెందిన పెండెం శ్రీనివాస్(57) 2021 ఆగస్టులో ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. అతడు గతంలో కూడా చాలా సార్లు ఇదేవిధంగా ఇంట్లో నుంచి వెళ్లి 5, 6 నెలల తర్వాత తిరిగి వచ్చేవాడు. కానీ ఈసారి ఇప్పటి వరకు కూడా తిరిగి రాలేదు. దీంతో మంగళవారం అతడి భార్య పెండెం లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా శ్రీనివాస్ మద్యం ఎక్కువగా తాగుతూ, ఎటువంటి బాధ్యతలు లేకుండా తిరుగుతూ, కుటుంబ సభ్యులను సరిగ్గా పట్టించుకునేవాడు కాదని అతడి భార్య పోలీసులకు తెలిపింది.

నవీన్ హత్య కేసుపై పోలీసుల విచారణ


ఘటనాస్థలిలో నవీన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

నిడమనూరు : నవీన్ హత్య కేసులో తొమ్మిది మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. త్రిపురారం మండలం జి.అన్నారం గ్రామానికి చెందిన ఇరిగి నవీన్‌ను నిడమనూరు మండలం గుంటిపల్లిలో గత ఆదివారం కర్రలతో కొట్టి, కత్తులతో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్ ప్రేమించిన యువతి బంధువులైన జి. అన్నారం గ్రామానికి చెందిన మర్రి రాజు, లింగంపల్లి రాజేష్, కొడదల శివప్రసాద్, తాళ్ల నవదీప్, మణితేజ్‌తో పాటు మరో ముగ్గురు మొత్తం తొమ్మిది మంది సోమ, మంగళవారాల్లో త్రిపురారం పోలీసులకు లొంగిపోయారని సమాచారం. వారందరినీ మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయిత్యే, హత్యోదంతంలో ఎవరెవరు పాల్గొన్నారు.. హత్యకు గల కారణాలు తదితర అంశాలపై నిందితులను విచారిస్తున్నట్లు తెలసింది. వీరిని ఒకటి, రెండు రోజుల్లో మీడియా ఎదుట ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం.

నవీన్ కత్తితోనే ఘాతుకం ?

నిడమనూరు మండలం గుంటిపల్లిలో నవీన్, అతడి స్నేహితులకు నచ్చచెప్పే ప్రయత్నంలో గొడవపడిన యువతి బంధువులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే, తదనంతరం స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్న నవీన్ తిరిగి యువతి బంధువులకు ఫోన్ చేయించడంతో మూడు బైక్‌లపై వారు కర్రలతో వచ్చి దాడి చేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే, ఆత్మరక్షణకు నవీన్ తన వద్ద ఉన్న కత్తిని చూపి బెదిరిస్తూ పరుగెత్తుతుండగా కొందరు వెంబడించారు. వెంట ఉన్న నవీన్ స్నేహితుడు అనిల్ కూడా వారికి దొరక్కుండా పరుగెత్తగా కొందరు వెంబడించారని, వారిని అతను దొరకలేదని చెబుతున్నారు. అయితే, యువతి బంధువులు నవీన్‌ను వెంటాడి అతడి చేతిలోని కత్తి తీసుకునే పొడిచినట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది. అయితే, నవీన్ కత్తితోనే పొడిచారా, మరో ఆయుధాన్ని వాడారా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. నిందితుల్లో ఏడుగురు యువతి బంధువులు కాగా, మరో ఇద్దరు మరో సామాజికవర్గానికి చెందిన వారుగా తెలిసింది. మద్యం మత్తులో స్నేహితుల కోసం వచ్చి వారు కూడా కేసుల్లో ఇరుక్కున్నట్లు తెలుస్తోంది.

కాలువలో పడిన మహిళ.. కాపాడిన యువకులు


సత్తమ్మ

కనగల్: ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో పడిన మహిళను ముగ్గురు యువకులు కాపాడిన సంఘటన కనగల్ మండల పరిధిలోని కురంపల్లి వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. చండూరు పట్టణానికి చెందిన కల్లెట్ల సత్తమ్మ నల్లగొండ పట్టణంలోని తన కుమారుడి వద్దకు వెళ్లి తిరిగి మంగళవారం చండూరుకు ఆటోలో బయల్దేరింది. ఆటో కురంపల్లి గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ వద్దకు రాగానే ఆమె బహిర్భూమికి వెళ్లాలని చెప్పి ఆటోలో నుంచి దిగింది. అనంతరం సత్తమ్మ ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో జారిపడింది. అదే సమయంలో కురంపల్లి గ్రామానికి చెందిన జెట్టి రాజు, అమరోజు గణేష్, జెట్టి వినోద్ ఆమెను గమనించి కాలువలోంచి అతికష్టం మీద బయటకు తీసుకొచ్చారు. సత్తమ్మ కాలువలోకి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకునేందుకే ఆమె కాలువలోకి దూకి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సదరు యువకులు సత్తమ్మ బంధువులకు సమాచారం అందించగా వారు వచ్చి ఆమెను తీసుకెళ్లారు. సత్తమ్మను కాపాడిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

బాలుడిపై కుక్కల దాడి


గాయపడిన బాలుడు

భువనగిరి: బాలుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన భువనగిరి పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తారాకరామానగర్‌కు చెందిన ముజాహిద్ కుమారుడు యాసిన్ మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అదే సమయంలో ఇంటి ముందు ఉన్న కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. స్థానికులు గమనించి తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాలుడిని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు.

బైక్ పైనుంచి పడి యువకుడు మృతి


నాగరాజు (ఫైల్)

గుర్రంపోడు: అదుపుతప్పి బైక్ పైనుంచి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చేపూరు గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన ముంగి నాగరాజు (23) హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి స్వగ్రామం వచ్చిన అతడు మంగళవారం చేపూరు గ్రామంలో తన స్నేహితుడిని కలవడానికి వెళ్లాడు. స్నేహితుడిని కలిసి తిరిగి ఇంటికి వస్తుండగా చేపూరు గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి వ్యవసాయ భూమిలో పడిపోవడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ దారి గుండా వెళ్లే వారు గమనించి 108 వాహనంలో నాగరాజును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి అన్న ముంగి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడి.. లేగ దూడ మృతి

మోటకొండూర్: కుక్కల దాడిలో లేగ దూడ మృతిచెందిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన వడ్డెబోయిన శ్రీరాములు మంగళవారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద చెట్టుకు ఆవును, లేగ దూడను కట్టివేయగా కుక్కలు లేగ దూడపై దాడి చేసి చంపేశాయి.

పీఏసీఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్ల రాజీనామా

- చైర్మన్, సీఈఓలపై అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన


డీసీఓ కార్యాలయంలో రాజీమానా పత్రాలు అందజేస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్లు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పీఏసీఎస్ చైర్మన్, సీఈఓలపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా మంగళవారం వైస్ చైర్మన్ వాకిటి మల్లారెడ్డి, డైరెక్టర్లు సురుగూరి భారతమ్మ, పక్కీరు జంగారెడ్డి, గట్టు రాంరెడ్డి, పాటి బుచ్చిరెడ్డి, ఉడతల జంగయ్య, బొబ్బల బాలకృష్ణారెడ్డి, అందెల జ్యోతి, పుడత పున్నయ్య మూకుమ్మడి రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను కలెక్టర్, డీసీఓ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలూరు పీఏసీఎస్‌లో చైర్మన్‌తో పాటు సీఈఓ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని గతంలో కలెక్టర్, డీసీఓ, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చామని, దీనిపై అధికారులు సైతం విచారణ చేసి అక్రమాలు జరిగాయని తేల్చుతూ నివేదిక కూడా ఇచ్చారని అన్నారు. అయినప్పటికీ వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోనందుకు తీవ్ర ఆవేదన చెందుతూ మూకుమ్మడి రాజీనామా చేసినట్లు తెలిపారు. వెంటనే తమ రాజీనామాలను ఆమోదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాడుగులపల్లి: మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మంగళవారం పెద్దదేవులపల్లి రిజర్వాయర్ గేట్ల వద్ద జాలర్లకు మృతదేహం కనిపించడంతో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన విషయాన్ని పోలీసులకు తెలపడంతో అక్కడికి చేరుకొని జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వయస్సు 40–45 ఏళ్లు ఉంటుందని, కుడి చేతిపై అమ్మానాన్న పచ్చబొట్టు ఉందని, ఒంటిపై బనియన్ ధరించినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించామని, మృతుడి వివరాలు తెలిసిన వారు మాడుగులపల్లి స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

యాదాద్రి ఆలయంలో సంప్రదాయ పూజలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న పూజారి


ముఖ మండపంలో పూజలు చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, మహారాష్ట్రకు చెందిన నాయకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఈ క్షేత్రానికి క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అంజనీపుత్రుడికి నైవేద్యాన్ని ఆరగింపు పెట్టారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు జరిగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు.

యాదాద్రిని దర్శించుకున్న మహారాష్ట్ర బృందం

యాదాద్రి ఆలయాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని లాతూరు, నాందేడ్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు జ్ఞానేశ్వర్ జగ్తాలే, గజానన్ థోరట్, ప్రదీప్ సోలంకే, సునీల్ అడ్సుల్, ప్రతాపరావు జాదవ్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణ విశిష్టతను వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆచార్యులు వారికి వివరించారు. వీరికి ఆచార్యులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

పోలీసు అధికారులకు రివార్డులు అందజేత


భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డికి ప్రశంసా పత్రం అందజేస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్


రివార్డు, ప్రశంసా పత్రం అందుకుంటున్న తుర్కపల్లి ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్

భువనగిరి: విధి నిర్వహణలో 2023 జనవరి నుంచి మార్చి వరకు అత్యుత్తమ పనితీరుని కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంగళవారం హైదరాబాద్‌లోని తార్నాకలో గల ఐపీసీటీలో నిర్వహించిన కార్యక్రమంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్‌రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి సీపీ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

రివార్డు అందుకున్న తుర్కపల్లి ఎస్‌ఐ..

తుర్కపల్లి: రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ చేతుల మీదుగా తుర్కపల్లి ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ రివార్డు అందుకున్నారు. కేసులను త్వరగా ఛేదించి నేరస్తులకు శిక్షపడేలా కృషి చేసినందుకు గాను ఆయన ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

అధిక దిగుబడికి జీవ ఎరువులు తప్పనిసరి


గడ్డిపల్లి కేవీకేలో జీవ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: భూసారాన్ని పరిరక్షించుకోవడంతో పాటు పంటల అధిక దిగుబడికి జీవ ఎరువుల వాడకం తప్పనిసరి అని మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని మండ్సార్ యూనివర్సిటీలో బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు మంగళవారం కేవీకేలో జీవ ఎరువులపై అవగాహన కల్పించారు. జీవ ఎరువుల్లో అజోస్పిరిల్లం, పాస్ఫో బ్యాక్టీరియా, పొటాష్ బ్యాక్టీరియా తయారీని నేర్చుకుని స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్ జీవ ఎరువులు తయారుచేయడానికి కావాల్సిన మీడియా, కల్చర్ ప్రిపరేషన్, మిక్సింగ్, స్టోరేజ్, ప్యాకింగ్‌పై నెల రోజుల పాటు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండ్సూర్ యూనివర్సిటీ విద్యార్థులు శివరామకృష్ణ నాగునాయక్, సాయికృష్ణ, నితిన్, వాసురాయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


ఆలేరురూరల్: డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ గొంగిడి సునీత

ఆలేరురూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఆలేరు మున్సిపాలిటీలోని 6వ వార్డు బాహదూర్‌పేటలో రూ.96లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ తదితర నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో పాటు నాయకులు, కార్యకర్తల కృషితో బీఆర్ఎస్ పార్టీ ఎదురులేని శక్తిగా ఎదిగిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాలల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన నాయకులను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ దిక్కుమొక్కు లేని పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కేంద్రంలోని మోదీ సర్కార్ అడ్డుకుంటుందని ఆరోపించారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ రాయపురం నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, కుండె సంపత్, కూళ్ల సిద్దులు, జంపాల దశరథ, కూళ్ల వెంకటేష్, ఆడెపు బాలస్వామి, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, బేతి రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు అండగా ప్రభుత్వం..

భువనగిరి: ఆర్ఎంపీ, పీఎంపీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం వార్షికోత్సవ మహాసభను భువనగిరి పట్టణంలోని రావిభద్రాద్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న సుశ్రుత గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సుశ్రుత గ్రామీణ వైద్యులకు జీఓ నంబర్ 428 ప్రకారం గుర్తింపు రావడానికి తమ వంతు కృషిచేస్తామన్నారు. అంతకు ముందు పట్టణంలో కరోనాపై అవగాహన సదస్సుకు సంబంధించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు చెన్న కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లక్ష్మణ్‌గౌడ్, గ్రామీణ వైద్యులు శంకర్, నరసింహ, సుధాకర్, నారాయణ, విశ్వనాథం, మురళి, నర్సింగ్‌రావు, సంధ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో తనిఖీలు


ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని శ్రీవాసుదేవ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు, కొలతలు, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న గ్యాస్ సిలిండర్లకు, స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు ఉండటం, వేరే కంపెనీకి చెందిన గ్యాస్ సిలిండర్లు గోడౌన్‌లో ఉండటంతో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీ రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. తనిఖీలలో తూనికలు, కొలతల జిల్లా అధికారి కె. వెంకటేశ్వర్లు, విజిలెన్స్ సీఐ మహేష్, సివిల్ సప్లై అధికారులు రాజశేఖర్, నాగలక్ష్మీ, నబీ, ప్రసాద్, హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

వరి గడ్డి దగ్ధం

మఠంపల్లి: వరి గడ్డితో వస్తున్న ట్రాక్టర్‌కు విద్యుదాఘాతంతో మంటలు అంటుకొని ట్రక్కుతో సహా వరి గడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని కొత్తతండా వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తతండాకు చెందిన రైతు పొలం నుంచి ట్రాక్టర్‌లో వరి గడ్డిని వేసుకుని వస్తుండగా స్థానిక పాఠశాల వద్ద విద్యుత్ తీగలు తగిలి మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు గమనించి కేకలు వేయడంతో డ్రైవర్ ట్రాక్టర్ ఇంజన్‌ను ట్రక్కు నుంచి తప్పించాడు. దీంతో ట్రక్కుతో సహా వరి గడ్డి పూర్తిగా కాలిపోయింది.

నకిరేకల్ విద్యార్థికి ఇస్రో సైంటిస్ట్ అవార్డు


విద్యార్థిని సత్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

నకిరేకల్: ఇస్రో వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన యువిక–2023 యంగ్ సైంటిస్ట్ అవార్డుకు నకిరేకల్‌లోని న్యూవిజన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న యానాల శ్రీశివాంజన్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీశివాంజన్‌రెడ్డిని మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈఓ మేకల నాగయ్య సత్కరించారు. దేశవ్యాప్తంగా ఇస్రో వారు అన్ని రాష్ట్రాల నుంచి మొత్తం 350 మందిని అవార్డుకు ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

- కేసు నమోదు

అడ్డగూడూరు: బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం మండల పరిధిలోని జానకీపురం శివారులో పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జానకీపురం గ్రామానికి చెందిన గొడిశాల నరేష్‌కు చెందిన ట్రాక్టర్‌లో గ్రామ శివారులోని బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

వైద్య పరీక్షలపై దృష్టి సారించాలి

- యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

బీబీనగర్: ఆరోగ్య మహిళా కేంద్రాల్లో మహిళలు వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా వైద్యసిబ్బంది దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బీబీనగర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గల ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా మహిళలు కేంద్రాలకు వస్తున్న తీరు, పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత 6 వారాలుగా 427మంది మహిళలు ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం 100 మందికి పైగా మహిళలు ఆరోగ్య కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా కేంద్రంలో నిర్వహించే పరీక్షల గురించి మహిళలకు తెలియజేయాలని సూచించారు. ఆమె వెంట వైద్యులు యాదగిరి, ఇందిర, వేణు, మాధవి ఉన్నారు,